సాక్షి
చిత్తూరు
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



సామాన్యులకు సత్వర న్యాయం

సామాన్యులకు సత్వర న్యాయం అందించేలా జడ్జిలు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి సూచించారు. - 8లో



సేంద్రియం.. సుస్థిరం

సేంద్రియ విధానంలో సాగు చేపట్టేందుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	24
తిరుపతి	36	26
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

పారదర్శకంగా సామాజిక తనిఖీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జేఎస్ రాజు

చౌడేపల్లె : ఉపాధి హామీ పనులకు సంబంధించి పారదర్శకంగా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ జేఎస్ రాజు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని కొండామర్రి, కాగతి, ఆమినిగుంట, పందిళ్లపల్లె, చింతమాకులపల్లె పంచాయతీల్లో ఉపాధి పనుల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1,752 పనులకు గాను రూ.7కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి రికార్డులను పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు వివరించారు. అనంతరం డీఆర్‌పీ నరేంద్రతో కలిసి కొండామర్రి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ప్రతి కుటుంబం ఏటా వందరోజులపాలు పనులకు హాజరుకావాలని సూచించారు. రోజుకు గరిష్ఠంగా రూ.272 కూలి పొందే అవకాశముంటుందని తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమర్‌నాథ్



చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమర్‌నాథ్ ఎన్నికైనట్లు సంఘం నేతలు శనివారం ప్రకటించారు. జిల్లాలోని రొంపిచెర్ల మండలం తహసీల్దార్‌గా అమర్‌నాథ్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు జిల్లా సంఘం నాయకులు హుస్సేన్, పార్థసారథి, హేమాద్రిరాజు అభినందనలు తెలిపారు.

రేపటి ‘స్పందన’ రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ శనివారం తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని, ఎవరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

2న వరసిద్ధుని సేవకు విశాఖ పీఠాధిపతి

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకుని దర్శనానికి విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి సోమవారం విచ్చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ స్వామివారు సాయంత్రం పుష్కరణిలో మహాహారతి సమర్పించి, స్వర్ణరథోత్సవంలో పాల్గొంటారని వివరించారు.

సురక్ష.. సర్వజగద్రక్ష

ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది.. అనంతరం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసింది. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగులు.. గర్భిణులకు ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా సుమారు 478 మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. తొలిరోజు 32 శిబిరాలను ప్రారంభించి నిపుణులైన వైద్యులతో అత్యుత్తమ చికిత్సలందిస్తోంది. మందులను సైతం ఉచితంగా పంపిణీ చేస్తోంది.

- ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా అడుగులు
- ఇంటి ముంగిటకే వైద్య సేవలు
- ప్రతి ఒక్కరికీ నాణ్యమైన చికిత్సలు
- ఉన్నత లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



హెల్త్ క్యాంపు ప్రారంభిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్ తెలిపారు. శనివారం చిత్తూరులోని టెలిఫోన్ కాలనీ ఆరోగ్య కేంద్రంలో శనివారం ×జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్యశిబిరాన్ని కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముదతో కలసి ప్రారంభించారు. వీరపాండ్యన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోనాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 478 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని, నిష్ణాతులైన వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. రోగులకు చికిత్సలతోపాటు మందులను సైతం ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేయర్ అముద మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న మహోన్నత లక్ష్యంతో సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కింద తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 32 వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. నవంబర్ 15వ తేదీ వరకు మొత్తం 478 క్యాంపులు జరగనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య వివరాలతో కూడిన డేటాను ప్రత్యేక కేస్‌షీట్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మరింత మెరుగైన చికిత్సల అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ హాస్పిటల్స్ ద్వారా ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ అరుణ, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్యరంగంలో చారిత్రక విప్లవం

నగరి: వైద్యరంగంలో చారిత్రక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. శనివారం నగరిలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పట్టణంలోని పది వార్డుల్లో 15 రోజుల పాటు ఆరోగ్య సర్వేలో బీపీ, షుగర్, టెంపరేచర్, పల్స్, ఫీవర్ నిర్వహించి 9,750 మందికి టోకెన్లు అందించినట్లు వెల్లడించారు. సురక్ష శిబిరంలో వారికి నిపుణుల ద్వారా వైద్యచికిత్స అందించి మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడానికి ఆరోగ్యశ్రీ పథకానికి మరింత మెరుగులు దిద్దారని తెలిపారు. నూతనంగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అనుసంధానంగా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకోసమే పనిచేసే ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, గైనకాలజిస్టు ఆర్‌వీ మంజుల, పీడియాట్రీషియన్ లోకేష్, శేఖర్, ఆర్థో మానస, వైద్యులు సాయిచరణ్, ఎయిళరసన్ తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

దేశంలో తొలిసారి : జెడ్పీ చైర్మన్

వి.కోట:దేశంలో తొలిసారిగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష చరిత్రలో నిలిచిపోతుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం వి.కోట మండలం పాముగానిపల్లెలో సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా ఉండడం మన అదృష్టమన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా ప్రజలకు అత్యుత్తమ పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. మరో పర్యాయం జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. వైద్యశిబిరంలో సుమారు 105 రకాల మందులు ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ యువరాజు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, సర్పంచ్ సుబ్బారెడ్డి, వైస్ సర్పంచ్ నారాయణ రెడ్డి, వైద్యాధికారి రాజేష్ నాయ పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం : పురపాలక పరిధిలో అందరి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా రూ.66కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆ మేరకు పట్టణంలోని మొత్తం 25 వార్డుల్లో శరవేగంగా పనులు సాగుతున్నట్లు వివరించారు. అలాగే ప్రతి సచివాలయానికి అదనంగా రూ.40లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల వినియోగానికి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అధికారులకు అందించాలని కౌన్సిలర్లకు సూచించారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ పురపాలక భవన నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. గేటు వసూళ్ల రద్దుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ మేరకు చిరువ్యాపారులు మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లి గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి

పాలసముద్రం : చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మ జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో జీ–20 సదస్సు ప్రాధాన్యతా అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. నాగపద్మిని మాట్లాడుతూ చిరుధాన్య సాగు విస్తీర్ణం పెంచేందుకు మహిళలు సైతం కృషి చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. చీడపీడల నివారణకు జీవామృత కషాయం తయారు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం దేశీయ ఆవుపేడ 10 కేజీలు, ఆవు మూత్రం 10 లీటర్లు నల్లబెల్లం 2 కేజీలు, పప్పు దినసపిండి 2 కేజీలు, పుట్టమట్టి కేజీని 20 లీటర్ల నీటితో కలిపి వారం పాటు పులియబెట్టి వాడుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగపద్మిని

దేవేరులతో వరసిద్ధుని విహారం



ఉత్సవర్ల ఊరేగింపులో ఉభయకర్తలు, ఆలయ అధికారులు



యాళి వాహనంపై ఊరేగుతున్న సిద్ధి, బుద్ధి, సమేత వినాయకస్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శనివారం సిద్ధి, బుద్ధి, సమేతంగా గణనాథుడు యాళి వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా వేకువనే స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవర్లను శోభాయమానంగా అలంకరించి యాళి వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరులకు గ్రామోత్సవం నిర్వహించారు. అగరంపల్లెకు చెందిన నరసింహారెడ్డి కుమారులు, చినకాంపల్లెకు చెందిన సుబ్బారెడ్డి కుమారులు, ఆలయం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆదివారం స్వామివారికి విమానోత్సవం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లాలో ఆదివారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. మొత్తం 1,339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకు గాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యంతోపాటు కందిపప్పు, గోధుమ పిండి, చక్కెర, రాగులు అందించనున్నట్లు వివరించారు. కార్డుదారులు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దే సరుకులు పొందవచ్చని సూచించారు.

3న జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు అర్బన్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించను న్న సమావేశానికి మంత్రులు హాజరుకానున్న ట్లు వెల్లడించారు. ఈక్రమంలో సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

బావిలో వృద్ధుడి మృతదేహం

చౌడేపల్లి : చారాల రెడ్డికుంట సమీపంలోని బావిలో శనివారం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా రామసముద్రంలోని ఆంజనేయస్వామి వీధికి చెందిన రాజన్న(75) మూడు రోజుల క్రితం తన భార్యతో కలిసి శెట్టిపేటలోని కుమార్తె ఇంటికి వచ్చాడు. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు బావిలో మృతదేహమై కనిపించాడు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

కుక్క దాడి : చిన్నారికి గాయాలు

రొంపిచెర్ల : స్థానిక వారణాసిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మోక్షిత్(4) అనే చిన్నారి చదువుకుంటున్నాడు. శనివారం ఆయా లీలావతి సెలవు పెట్టడంతో టీచర్ లక్ష్మీదేవి ఉదయం పిల్లల తల్లిదండ్రులకు టీహెచ్‌ఆర్ పంపిణీ చేస్తోంది. ఇంతలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి మోక్షిత్ బయటకు వెళ్లిపోయాడు. అక్కడ ఉన్న కుక్క తోక పట్టుకోవడంతో అది వెంటనే దాడి చేసింది. మూడు చోట్ల గాయపరిచింది. బాలుడిని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తరలించారు. అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డకు ఈ పరిస్థితి వచ్చిందని తలిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సేంద్రియం.. సుస్థిరం

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ పెంచుకుంటున్నారు. రసాయన ఎరువులు.. పురుగు మందుల వినియోగాన్ని వదిలేస్తున్నారు.. సహజ సిద్ధంగా లభించే ఆకులతో కషాయాలు తయారు చేసుకుంటున్నారు. తద్వారా భూసార పరిరక్షించుకుటున్నారు. ఈ మేరకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఆరోగ్యకర పంటలను ఉత్పత్తి చేస్తూ ముందడుగు వేస్తున్నారు.

- ప్రకృతి వ్యవసాయం దిశగా అన్నదాత అడుగులు
- రసాయన ఎరువుల వాడకంపై విముఖత
- సహజ సిద్ధ ఆకుల కషాయాల వినియోగం



మిట్టపాళెంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

నగరి : సేంద్రియ వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులకు బదులుగా ప్రకృతిలో దొరికే ఆకుల కషాయాలతో సాగు చేపడుతున్నారు. రూ.వేలల్లో ఖర్చయ్యే ఎరువులు, పురుగుల మందుల వాడకానికి స్వస్తి పలికి సొంతంగా కషాయాలను సిద్ధం చేసుకుంటున్నారు. పంచగవ్యం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కంపోస్టు, వేప పిండి, జనుము తదితరాలను వినియోగిస్తున్నారు. జిల్లాలోని 697 పంచాయతీలకు గాను 174 పంచాయతీల్లో రైతులు సేంద్రియ పద్ధతులను అవలంబిస్తున్నారు.

ఈ ఏడాది జిల్లాలోని 39,349 మంది రైతులతో 58,850 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేయడానికి ప్రకృతి వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని నిర్ధారించుకుంది. ఈ మేరకు 29 వేల మంది రైతులతో 31,500 ఎకరాల్లో సాగు చేయిస్తోంది. మిగిలిన లక్ష్యాన్ని రబీ సీజన్‌లో పూర్తి చేసేందుకు సన్నద్ధమవుతోంది. నగరి మండలంలోనే 250 ఎకరాల వరు సేంద్రియ సాగు జరుగుతోంది. ఈ పద్ధతులను అవలంబించడం ద్వారా భూసారం కోల్పోవడం జరగదని, దిగుబడి ఎక్కువగా వస్తుందని, భూముల్లో భూసారం పెంచే వానపాములు తయారవుతాయని ప్రకృతి వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటలు ఆరోగ్యకరమంటున్నారు.

ఆరోగ్యకరమైన పంట



"ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడి రావడంతోపాటు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుంది. సేంద్రియ ఎరువుల తయారీలో సందేహాలు ఉంటే 95023 98214 నంబర్‌లో సంప్రదిస్తే అవగాహన కల్పిస్తాం. వాడే విధానాన్ని రైతులకు వివరిస్తాం.

– చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం

రబీ నాటికి లక్ష్యం పూర్తి



సేంద్రియ సాగుతో ఆరోగ్యకరమైన పంటల వైపు రైతులను తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. జిల్లాలోని 30 శాతం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాం. ఈ ఏడాది నిర్ణయించుకున్న లక్ష్యం వాతావరణ పరిస్థితుల ప్రభావంతో కొంత తగ్గినా రానున్న రబీ సీజన్‌లో లక్ష్యం పూర్తి చేస్తాం.

– జి.వాసు, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రకృతి వ్యయసాయం.

నగరి మండలం వేలావడి వద్ద జీవామృతం తొట్టి నిర్మించుకుంటున్న రైతు శ్రీనివాసులు



శాశ్వత ప్రాతిపదికన జీవామృతం తొట్టెలు

ఘన జీవామృతాన్ని రైతులు పిడకల రూపంలో తయారు చేసి ఉంచుకునేవారు. ద్రవజీవామృతాన్ని ప్లాస్టిక్ తొట్టెల్లో క్యాన్లలో నిల్వ చేసుకునేవారు. ఈ క్రమంలో వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. పొలానికి నీరందించే కాలువల పక్కనే సిమెంట్ వరలతో 500 లీటర్ల సామర్థ్యం ఉన్న తొట్టెలను పక్కాగా నిర్మించుకుంటున్నారు. ఈ తొట్టెలకు అడుగున కొళాయి ఏర్పాటు చేసి నీటి కాలువల్లో వదిలేస్తున్నారు. ఇలా చేయడంతో నీటితో కలిసి ద్రవజీవామృతం సమంగా పొలానికి అందుతోంది. ఇది సత్ఫలితాలు ఇస్తున్నట్లు రైతులు వెల్లడిస్తున్నారు.



కృష్ణారామపురంలో జీవామృతం తయారు చేస్తున్న రైతు

సామాన్యులకు సత్వర న్యాయం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి

చిత్తూరు అర్బన్: సామాన్యులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు చొరవ చూపాలని హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హారి స్పష్టం చేశారు. శనివారం చిత్తూరు జెడ్పీ మీటింగ్ హాలులో 'డాక్యుమెంటేషన్ అండ్ ఎవిడెన్స్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ నేర నిరూపణలో దస్త్రాలు, సాక్ష్యాల నిక్షిప్తం ప్రధానమైందన్నారు. కేసుల విచారణ, సాక్ష్యాల నమోదుపై పలువురు అడిగి ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. సమావేశంలో చెన్నై సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ దిల్‌షాద్ షేక్, తిరుపతి అనంత లా కాళాశాల ప్రొఫెసర్ నాగార్జునరెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, జడ్జిలు రమేష్, శాంతి, శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ పాల్గొన్నారు. అలాగే ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో హైకోర్టు న్యాయమూర్తిని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కమిటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 76 మందితో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కమిటీని నియమిస్తున్నట్లు ఆపార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వారిలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురికి చోటు లభించింది. వారిలో ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు జిల్లాకు చెందిన డాక్టర్ నారాయణ రెడ్డి నియమితులయ్యారు. కార్యదర్శులుగా తిరుపతి జిల్లాకు చెందిన డాక్టర్ సి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రగణేష్‌రెడ్డి, డాక్టర్ పాలూరి మహేంద్రరెడ్డి, డాక్టర్ జల్లి వరప్రసాద్, డాక్టర్ పాలూరి రాజేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా తిరుపతి జిల్లాకు చెందిన డాక్టర్ బీబీ ఆనందప్రసాద్‌రెడ్డిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం : మండలంలోని పెద్ద తయ్యూరు వద్ద శనివారం కారు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. చిన్నతయ్యూరు దళితవాడకు చెందిన ప్రవీణ్ (27), అలెగ్జాండర్ (22) ద్విచక్ర వాహనంపై వస్తుండగా చిత్తూరుకు వెళుతున్న కారు ఢీకొంది. క్షతగాత్రులను 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలెగ్జాండర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ షేక్షావలీ తెలిపారు.

ఆకతాయికి దేహశుద్ధి



షమీపుల్లాను స్తంభానికి కట్టేసిన మహిళలు

రొంపిచెర్ల : వేధింపులకు గురి చేస్తున్న ఓ ఆకతాయికి స్థానిక మహిళలు దేహశుద్ధి చేశారు. వివరాలు.. రొంపిచెర్ల ముత్యాలమ్మగుడి వీధికి చెందిన షమీపుల్లా(35) అనే వ్యక్తి మేస్త్రీ పని చేస్తున్నాడు. నిందితుడు చిన్నమసీదు వీధిలో రాత్రివేళల్లో సంచరిస్తూ ఇళ్ల తలుపులు కొట్టడం, బాత్‌రూమ్‌ల వద్ద తిరగడం, మహిళలపై రాళ్లు వేయడం, ఎవరైనా బయటకు వస్తే వెంటనే పారిపోవడం చేస్తున్నాడు. దాదాపు 15 రోజులుగా ఈ ప్రాంతంలోని మహిళలకు కంటి మీద కునుకు లేకుండా చేశాడు. దీంతో శుక్రవారం రాత్రి కాపు కాసిన మహిళలు ఆకతాయిని పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు అనంతరం పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి..

గంగాధరనెల్లూరు: మండలంలోని ఆవల్ కొండ ప్రాంతానికి చెందిన రియాజ్ ఖాన్ అనే వ్యక్తి శనివారం కొత్త వెంకటాపురం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద ప్రమావశాత్తు తీగలు తగలడంతో షాక్‌కు గురై గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రియాజ్‌ఖాన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కొడవలితో దాడి: ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు : మండలంలోని ఒంటిమిట్టలో హరనాథ్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప, నరసింహులు కొడవలితో దాడి చేశారు. దీంతో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. పాత కక్షల నేపథ్యంలో దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో హరనాథ్ చికిత్స పొందుతున్నాడు.